క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

చిట్యాల: మండలంలోని ఆదర్శ పాఠశాల కళాశాలలో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం చదివేందుకు నేడు(సోమవారం) నుంచి ఈ నెల 20 వరకు ఆన్‌లైన్‌లో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ మేకల రమేశ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూప్‌లో 40 సీట్లు ఖాళీగా ఉంటాయని తెలిపారు. బాలికలకు ప్రత్యేకమైన హాస్టల్ సౌకర్యం ఉందని అన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి సర్టిఫికెట్ల పరిశీలన ఈనెల 21 నుంచి ఈనెల 31 వరకు కొనసాగుతుందన్నారు.

పోలీసుల అదుపులో ముగ్గురు?

ఏటూరునాగారం: మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి శివాలయం వీధిలో వృద్ధురాలిపై హత్యాయత్నం విషయంలో ముగ్గురు అనుమానిత వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వృద్ధురాలి తలపై బండరాయిని ఎందుకు మోదారని, దాని వెనుక ఎవరు ఉన్నారని పోలీసులు కూపీ లాగుతున్నారు. హత్యాయత్నానికి గల కారణాలపై విచారణ చేపడుతున్నట్లు సమాచారం.

పూరిల్లు దగ్ధం



వెంకటాపురం(కె): మండల పరిధిలోని వీరభద్రవరం పంచాయతీ సుందరయ్య కాలనీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఆదివారం పూరిల్లు దగ్ధమైంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. సుందరయ్య కాలనీకి చెందిన బంద లక్ష్మి పూరిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో ఇంటికి నిప్పు అంటుకొని మంటలు వచ్చాయని తెలిపారు. గమనించిన గ్రామస్తులు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించిన ఫలితం లేకుండా పోయిందన్నారు. ప్రమాదం జరిగిన సమయంలో ఇంట్లో ఎవరు లేక పోవటంతో ప్రమాదం తప్పిందని తెలిపారు. దాదాపు రూ.30 వేల నగదు, ఇంట్లో సామగ్రి కాలిపోయాయని పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ఆత్మకూరు : మండలంలోని పెద్దాపూర్‌లో ఆదివారం పెద్దాపూర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ అంబటి రాజస్వామి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కమలాపురం రమేష్, సొసైటీ మాజీ చైర్మన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్, నాయకులు బీరం సుధాకర్‌రెడ్డి, పరికిరాల వాసు, కొక్కొర్ల రాజు, రవి, మాజీ వైస్ ఎంపీపీ సాంబయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ స్వామి పాల్గొన్నారు.

నియామకం

శాయంపేట : మండలంలోని గోవిందాపూర్‌కు చెందిన దాసి శ్రావణ్‌కుమార్‌ను బీఆర్ఎస్ మండల సోషల్ మీడియా కన్వీనర్‌గా నియమించినట్లు పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్ రెడ్డి ఆదివారం ప్రకటించారు. తన నియామకానికి సహకరించిన మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికి శ్రావణ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

సందడిగా సమ్మర్ స్పోర్ట్స్ క్యాంపు



ఆసనాలు వేస్తున్న విద్యార్థులు



వాలీబాల్ నేర్పిస్తున్న కోచ్

- మారుమూల గ్రామాల్లో క్యాంపుల ఏర్పాటు
- క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొంటున్న విద్యార్థులు
- జూన్ 6 వరకు శిక్షణ

వాజేడు: వేసవి సెలవుల్లో విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రమ పద్ధతికి అలవాటు పడడం కోసం ప్రత్యేకంగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో సమ్మర్ క్రీడల క్యాంపులను ఏర్పాటు చేశారు. జిల్లాలో కలెక్టర్ దివాకర, జిల్లా క్రీడల అధికారి తుల రవి ఆధ్వర్యంలో 10 క్యాంపులను ఏర్పాటు చేయగా అందులో మండల పరిధిలోని మారుమూల గ్రామం కోయవీరాపురంలో ఒకటి ఏర్పాటు చేశారు. ఇక్కడ శిక్షకుడు, ఫిట్నెస్ ట్రైనర్‌గా అదే గ్రామానికి చెందిన ఉయిక నవీన్‌ను నియమించారు.

ఉత్సాహంగా పాల్గొంటున్న విద్యార్థులు..

క్యాంపులో 14 సంవత్సరాలలోపు వయసు ఉన్న బాల, బాలికలు మాత్రమే ఆధార్ కార్డు ద్వారా ఆన్‌లైన్ నమోదు చేసుకుని జాయిన్ అవ్వాల్సి ఉంటుంది. కోయవీరాపురంలోని క్యాంపులో ఇప్పటి వరకు 27 మంది బాలికలు, 26 మంది బాలురు మొత్తం 53 మంది శిక్షణ పొందుతున్నారు. వారికి శిక్షణ జూన్ 6 వరకు కొనసాగుతుంది. ఇందులో చేరిన బాల, బాలికలకు వాలీబాల్, రెజ్లింగ్, తైక్వాండో, క్రికెట్, అథ్లెటిక్స్, కరాటే, హ్యాండ్ బాల్‌లో శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ పూర్తి అయిన తరువాత వీరికి ధ్రువీకరణ పత్రాలను కూడా అందించనున్నారు.

శిక్షణ ఇస్తున్నాం..



సమ్మర్ క్రీడల క్యాంపునకు హాజరవుతున్న బాల, బాలికలకు క్రీడల్లో నైపుణ్యం ప్రదర్శించేలా శిక్షణ ఇస్తున్నాం. అదే సమయంలో క్రమ శిక్షణతో ఎలా మెలగాలో తెలియజేస్తున్నా. ప్రతీ రోజు రన్నింగ్, ఆసనాలతో పాటు అథ్లెటిక్స్, క్రీడలను నేర్పిస్తూ వారిని మెరుగు పరుస్తున్నాం.

– ఉయిక నవీన్, ఫిట్నెస్ ట్రైనర్

ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం రెండు పర్యాయాలు వీరికి శిక్షణ ఇస్తున్నారు.

బస్టాండ్ ఏర్పాటు చేయాలని వినతి



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కన్నాయిగూడెం: మండల కేంద్రంలో బస్టాండ్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర రోడ్డు, రవాణ శాఖ, బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కాంగ్రెస్ మండల ఇన్‌చార్జ్ జాడి రాంబాబు, మండల అధ్యక్షుడు అప్సర్ పాషా కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన మోడల్ బస్టాండ్ ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రి ప్రభాకర్‌కు మంత్రి సీతక్క ఆధ్వర్యంలో నాయకులు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ జిల్లా కమిటీ మెంబర్ సునార్కని రాంబాబు, బీసీ సెల్ మండల అధ్యక్షుడు గద్దం నాగేష్, అరుణ్, సాగర్ ప్రభాకర్, తాటి రాజుబాబు, దుర్గం ప్రభాకర్, సోషల్ మీడియా కో కన్వీనర్, సునార్కని సాంబశివరావు, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికులకు గుర్తింపు కార్డులివ్వాలి



మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న నర్సయ్యగౌడ్, నాయకులు

మంగపేట: జిల్లాలోని ఏజెన్సీ గ్రామాల్లో కులవృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న కల్లుగీత కార్మికులకు గుర్తింపు కార్డులను ఇప్పించాలని కోరుతూ తెలంగాణ ఏజెన్సీ గౌడ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు కారుపోతుల నర్సయ్యగౌడ్ ఆదివారం జిల్లా కేంద్రంలో మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. జిల్లాలోని మంగపేటలో 2001 నుంచి కల్లుగీత సొసైటీలను రద్దు చేసి గీత కార్మికులకు బతుకుదెరువు లేకుండా చేశారని వాపోయారు. అప్పటి నుంచి ప్రమాదవశాత్తు ఎవరైనా తాడి చెట్టుపై నుంచి పడి మృతి చెందితే రూ.5 లక్షల నష్టపరిహారం, 50 సంవత్సరాలు దాటిన గీత కార్మికులకు పెన్షన్, ప్రభుత్వం ప్రవేశపెట్టి పథకాలు తమకు అందడం లేదని మంత్రికి వివరించారు. గత ప్రభుత్వానికి తమసమస్యలపై విన్నవించినా పట్టించుకోలేదని విషయంపై స్పందించి తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి ఏజెన్సీ గ్రామాల్లో నివసిస్తున్న గీత కార్మికులకు కనీసం గుర్తింపు కార్డులను అందించి ప్రభుత్వ పథకాలు అందే విధంగా చూడాలని కోరారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి



చిట్యాల: మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

చిట్యాల: భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్ర కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుట్ల తిరుపతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సత్యనారాయణరావు, జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పరిశీలకులు పున్న కైలాస్ నేత, డీసీసీ అధ్యక్షుడు, ట్రెడ్ కార్పొరేషన్ చైర్మన్ ప్రకాశ్‌రెడ్డి హాజరైయ్యారు. బాపూజీ, అంబేడ్కర్, రాజ్యాంగ పీఠిక చిత్రపటాలకు పూలమాల వేసి అక్కడి ప్రజలు, నాయకులతో రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా రాజ్యాంగ విలువలపై ప్రజలలో అవగాహన పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవిసత్యం, నాయకులు గాజర్ల అశోక్, ముకిరాల మధువంశీకృష్ణ, చిలుకల రాయకోంరు, దొడ్డి కిష్టయ్య, మాజీ జడ్పీటీసీలు ఓరం సమ్మయ్య, పులి తిరుపతి రెడ్డి, నాయకులు బుర్ర లక్ష్మన్, శ్రీనివాస్ అనిల్, అశోక్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

భగీరథ మహర్షిని స్మరించుకోవడం కర్తవ్యం

రేగొండ: గంగను భువికి తెచ్చిన మహనీయుడు భగీరథ మహర్షిని స్మరించుకోవడం, పూజించడం మనందరి కర్తవ్యమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఆదివారం మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో సగర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన భగీరథ మహర్షి జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏదైనా సాధించాలనే పట్టుదలకు భగీరథ ప్రయత్నం ఒక స్ఫూర్తి అని పేర్కొన్నారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా దివి నుంచి భువికి గంగను లోక కల్యాణం కోసం తీసుకువచ్చిన మహానుభావుడని కొనియాడారు. మరుగునపడిన చరిత్రకారుల జీవితాలను, మహనీయుల గొప్పతనాన్ని వెలికితీసి వారి ఆదర్శ భావాలకు అనుగుణంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాప్రభుత్వం అధికారికంగా ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం గొప్ప విషయమని అన్నారు. సగర కులస్తుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టయ్య, కాంగ్రెస్ నాయకులు పున్నం రవి, పట్టెం శంకర్, వీరబ్రహ్మం, గండి తిరుపతితో పాటు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



నుజ్జునుజ్జు అయిన వాహనాలు

ములుగు రూరల్: రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన సంఘటన మండలంలోని ఇంచర్ల పంచాయతీ పరిధి ఎర్రి గట్టమ్మ ఆలయం వద్ద ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. భూపాలపల్లి జిల్లా కాశింపల్లి గ్రామానికి చెందిన శేషాల చందు, బండ చిరంజీవి, సందీప్ లక్నవరం వెళ్లి వస్తున్న క్రమంలో వరంగల్ నుంచి ఏటూరునాగారం వెపు వెళ్తున్న మరో వాహనం గట్టమ్మ ఆలయం వద్ద ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలు కావడంతో గమనించిన ప్రయాణికులు 108కు సమాచారం అందించి ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న కృష్ణ

పరకాల : ముదురుతున్న ఎండల కారణంగా రోడ్లపైకి చేరుకుంటున్న పరిస్థితుల్లో ప్రజలు తాగు నీటికి ఇబ్బందులు పడుతున్న చలివేంద్రాల ఏర్పాటుకు స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు కృషిచేయాలని వెల్లంపల్లి మాజీ సర్పంచ్ కృష్ణ కోరారు. మండలంలోని వెల్లంపల్లిలో జైభీమ్ యూత్ సొసైటీ అధ్యక్షుడు బొట్ల అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. రహదారుల వెంట వెళ్తున్న బాటసారులకు, వాహనాదారులకు వేసవి కాలంలో చలి వేంద్రం ఏర్పాటు చేయడం వలన ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ పెండెల మల్లయ్య, కార్యదర్శి ప్రమోద్, కాకి శరత్, మచ్చ చందర్ తదితరులు పాల్గొన్నారు.

చిడెం సాయిప్రకాశ్ సేవలు మరువలేనివి



మాట్లాడుతున్న సీఐ బండారి కుమార్

వెంకటాపురం(కె): చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు చిడెం సాయి ప్రకాశ్ సేవలు మరువలేనివి అని సీఐ బండారి కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణంలో సాయి ప్రకాశ్ సంతాప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై సాయి ప్రకాశ్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. చేయూత స్వచ్ఛంద సేవా సంస్థను ఏర్పాటు చేసి వెంకటాపురం, వాజేడు మండలాల ప్రజకే కాకుండా జిల్లాలో రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయటంతో పాటు అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించి ప్రజలకు సేవా చేశారని అన్నారు. పీఏసీఎస్ చైర్మన్ చిడెం మోహన్‌రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, చిడెం రవి కుమార్, రంజిత్, పిల్లాల లీలా రాణి, గార్లపాటి రవి, గొంది హనుమంతు, గద్దల వెంకటేశ్వర్లు, శశి కుమార్, సన్ని, నరేష్, ఓంకార్, మధు తదితరులు ఉన్నారు.

కులగణనతో సామాజిక ఐక్యత

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కీర్తిరెడ్డి



ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కీర్తిరెడ్డి, నాయకులు

భూపాలపల్లి రూరల్: కేంద్ర ప్రభుత్వం చేపట్టే కులగణనతో సామాజిక ఐక్యత బలపడుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టాలని కేంద్రం నిర్ణయం తీసుకోవడంపై ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఓబీసీ మోర్చా నాయకుడు కంబాల రాజయ్య అధ్వర్యంలో బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి కీర్తిరెడ్డితో పాటు పార్టీ జిల్లా అధ్యక్షుడు నిశిధర్ రెడ్డి హాజరై మాట్లాడారు. దేశవ్యాప్తంగా జనాభా లెక్కలతో పాటు కులగణన పారదర్శకంగా చేటపట్టాలని మోదీ సర్కారు కీలక నిర్ణయం తనుకుందన్నారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సయ్య, స్థానిక నాయకులు యుగేంధర్, ప్రసాదరావు, బట్టు రవి, దొంగల రాజేందర్, పులుగుజ్జు రాజు, చెక్క శంకర్, తదితర నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ నిర్ణయం చరిత్రాత్మకం

మొగుళ్లపల్లి: జనగణనలోనే కులగణన దేశవ్యాప్తంగా చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం చరిత్రాత్మకమని బీజేపీ సోషల్ మీడియా కన్వీనర్ సురేష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఎప్పుడూ అండగా నిలబడుతుందన్నారు.

7నుంచి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

ఆత్మకూరు : మండలకేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి అధ్యయన బ్రహ్మోత్సవాలు ఈ నెల 7 (బుధవారం) నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు ఆరుట్ల మాధవమూర్తి తెలిపారు. 7న సాయంత్రం తొళ్లక్కంతో అధ్యయన బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతాయని, 8న ప్రాబోధకి, ప్రబంధసేవాకాలము ,9న ధ్వజారోహణం(గరుడముద్దలు), 10న ఉదయం హోమం సాయంత్రం శ్రీవారి కల్యాణోత్సవం, 11న పూర్ణాహుతి, 12న వ్యాసపౌర్ణమి బండ్లు తిరుగుట జాతర జరుగుతుందని అర్చకులు వివరించారు. ఉత్సవాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

అరటి తోట దగ్ధం



దగ్ధమైన అరటి తోట

ఆత్మకూరు : మండలంలోని అక్కంపేటలో ఓ రైతు తన అరటి తోట దగ్ధమైనట్లు తెలిపాడు. బాధితుడు కడుదుల దేవేందర్ కథనం ప్రకారం .. పెద్దాపూర్ గ్రామ శివారులో 2 ఎకరాల భూమిలో అరటి తోట పెట్టాడు. కాగా అరటి తోట పక్కన పేరుపెల్లి రవీందర్‌కు మొక్కజొన్న చేను ఉండగా శనివారం అట్టి చేనుకు నిప్పంటించగా మంటలు చెలరేగి సమీపంలో ఉన్న అరటి తోటలో అరటి మొక్కలు దగ్ధమయ్యాయని తెలిపారు. రూ.2 లక్షల నష్టం వాటిల్లిందని తనకు న్యాయం చేయాలని కోరుతూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మొరం తవ్వకాలు చేపట్టొద్దు



పత్తిపాకలో అభిప్రాయాలను సేకరిస్తున్న సీఐ రంజిత్‌రావు

శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామంలో మొరం తవ్వకాలు చేపట్టొద్దని చేపడితే అడ్డుకుంటామని గ్రామస్తులు హెచ్చరించారు. గ్రామస్తుల ఫిర్యాదుతో చేపల చెరువు కోసం తవ్వకాలు జరిపే పొలాన్ని ఆదివారం సీఐ రంజిత్‌రావు, ఎస్సై జక్కుల పరమేశ్ పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులను సమస్య తెలుసుకున్నారు. భారీ వాహనాల రాకపోకల వల్ల సీసీ రోడ్లు దెబ్బతినడమే కాకుండా నల్లా పైపులైన్లు దెబ్బతినే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. చేపల చెరువు పేరిట ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకొని మొరం తవ్వకాలు చేస్తున్నారని తెలిపారు. ప్రతిరోజు సీసీ రోడ్డుపై పిల్లలు తిరుగుతుంటారని, భారీ వాహనాలు నడవడం వల్ల దుమ్ము, దూళి లేస్తుందని ప్రతి రోజు రోడ్డుపై నీళ్ల చల్లాలని, నల్లా పైపులైన్లు దెబ్బతినకుండా చూసుకోవాలని గ్రామస్తులు పోలీస్ అధికారులకు తెలిపారు. గ్రామస్తుల అభిప్రాయాలు తెలుసుకొని మొరం తవ్వకాలు జరిపే పొలంను పోలీసులు పరిశీలించి వెళ్లిపోయారు.

ఇసుక అక్రమ రవాణాకు చెక్

- అనుమతులు తప్పనిసరి
- ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు



ఇసుక రవాణాపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

టేకుమట్ల: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆదేశాల మేరకు ఎలాంటి అనుమతులు లేకుండానే చలివాగు మానేరుల నుంచి స్థానిక అవసరాల కోసం ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఇసుకను తీసుకునేందుకు అనుమతులు జారీ చేశారు. దాంతో ఇంటి అవసరాల కోసం చాలా మంది తక్కువ ధరకు ఇసుకను తీసుకుని వినియోగించుకున్నారు. కానీ ఇదే అదనుగా భావించిన కొందరు అక్రమార్కులు ఇసుక అక్రమ దందాకు తెరలేపి నియోజకవర్గం దాటిస్తూ సొమ్ము చేసుకున్నారు. ఇలా గత కొంత కాలంగా యథేచ్ఛగా దందా కొనసాగడంతో అధికార యంత్రాంగమైన రెవెన్యూ, పోలీస్, మైనింగ్, భూగర్భ, అటవీ శాఖ అధికారులు ఏం చేయలేక మిన్నకుండిపోయారు. అక్రమ ఇసుకరవాణాకు అడ్డుకట్ట వేసే ఆలోచనతో అధికారులు శనివారం నుంచి నిబంధనలను కట్టుదిట్టం చేశారు. గృహ నిర్మాణ అవసరాలకు గానూ తప్పనిసరిగా స్థానిక తహసీల్దార్ నుంచి అనుమతులు తీసుకుని ఇసుకను తరలించుకోవాలని, నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తూ, పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఈ మేరకు గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు. దీంతో టేకుమట్ల, అంకుషాపూర్, రాఘవరెడ్డిపేట, గుమ్మడవెల్లి, కలికోట మానేరుల నుంచి ఇసుక రవాణాను పూర్తిగా నిలిపివేశారు.

తగ్గనున్న రవాణా..

ప్రస్తుతం తహసీల్దార్ అనుమతులు తప్పవనిసరి నిబంధనలు తీసుకువచ్చే సరికి అక్రమ ఇసుక రవాణా తగ్గనుంది. ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుకను తీసుకునే లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ల సాంక్షన్ లేటర్ ఇస్తే తహసీల్దార్ అనుమతులు మంజూరు చేస్తారు. అలాగే ఇతర నిర్మాణాలకు స్థానిక అధికారుల తప్పనిసరి కావడంతో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసే అవకాశం ఉంది. దీంతో సహజవనరులను దోపిడిదారుల నుంచి రక్షించినట్లు అవుతుందని మండల ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



కొంత మంది స్థానిక అవసరాల పేరుతో నియోజకవర్గాన్ని దాటిస్తూ అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారు. ఇక నుంచి ఎవరైనా ఇసుక అవసరమున్న వారు తప్పనిసరిగా అనుమతులు తీసుకుని ఇసుకను తరలించుకోవాలి. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు.

– విజయలక్ష్మి, తహసీల్దార్, టేకుమట్ల

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ములుగు: జిల్లాకేంద్రంలోని కాకతీయ ఉన్నత పాఠశాలలో 1997–98 బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థులు ఆదివారం హోటల్ రాయల్‌ప్లాజాలో సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం చదువు చెప్పిన గురువులను శాలువాలతో సన్మానించారు.